
ప్రజాశక్తి
సోమవారం 19 మే 2025
5
పార్వతీపురం మన్యం



ఖరీదైన మామిడిపండు మియాజాకి

ప్రజాశక్తి -భామిని

ప్రపంచంలోనే ఖరీదైన మామిడి పండ్లుగా చెప్పబడే మియాజాకి మామిడి పండ్లు భామినిలోని గురిబిల్లి లక్ష్మీపతి రైతు ఇంట కాశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జపాన్ లో ఈ పండ్లు సాగు ఎక్కువని, అక్కడ మార్కెట్ ధర కిలో 2.50 లక్షల ధర పలుకుతుందని తెలిపారు. తాను పెంచిన మియాజాకి మామిడి రకాన్ని హైదరాబాద్‌లోని ఒక నర్సరీలో ఒక మొక్క రూ.5వేలు చొప్పున రెండు మొక్కలు 2022లో కొన్నానని రైతు చెప్పారు. ప్రస్తుతం రెండేళ్ల జాగ్రత్తగా పెంచితే ఇపుడు కాపుకి వచ్చాయని చెప్పారు. ఈ పండులో అత్యధిక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, కాన్సర్ నిరోధక కారకాలు ఉంటాయని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే మౌనం వెనుక ఆంతర్యమేమిటో?



- టిడిపి ఆగడాలపై స్పందించని అలజంగి
- లోపాయికారీ అవగాహనలో భాగమేనని ప్రచారం

ప్రజాశక్తి - పార్వతీపురం

మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మౌనం వెనుక ఆంతర్యమేమిటోనన్న సర్వత్రా చర్చ జరుగుతోంది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. ఈ కాలంలో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక సంఘటనలు జరిగాయి. ప్రతిపక్ష పార్టీ నాయకునిగా, స్థానిక మాజీ ఎమ్మెల్యేగా సమకాలీన సామాజిక, రాజకీయ పరిణామాలపై ఆయన స్పందించాల్సి ఉంది. కానీ గడిచిన ఏడాది కాలంలో ఆయన గళం విప్పిన దాఖలాల్లేవు. గత ఎన్నికల్లో ఆయనపై మొదటిసారి పోటీ చేసి విజయం సాధించిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఈ ఏడాదిలో చాలా వరకు ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారనే చర్యలు సర్వత్రా జరుగుతోంది. ఎన్నికైన నాటి నుంచి ఎమ్మెల్యే బోనెల దూకుడుగా వ్యవహరించడమే కాకుండా భూ సమస్యల సెటిల్మెంట్లు, దందాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేసిన దాఖలాల్లేవు. తనపై గెలుపు సాధించిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కూడా గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలకు అనేక హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్కటీ ఆయన అమలు చేసిన పాపాన పోలేదు. ఒక వైపు ప్రభుత్వ వైఫల్యం, మరో వైపు స్థానిక ఎమ్మెల్యే వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నా మాజీ ఎమ్మెల్యే జోగారావు నోరు మెదపకపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా ప్రజలను ఏనుగుల సమస్య వెంటాడుతోంది. కురుపాం, కొమరాడ, పార్వతీపురం మండలాల ప్రజలు ఏనుగులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్వతీపురం పట్టణ ప్రజలు తీవ్రమైన తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. కొద్దినెలల క్రితం వైసిపికి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరిపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర నాయకత్వంలో అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసుని అందజేశారు. అవిశ్వాస నోటీసు లోపభూయిష్టంగా ఉండడంతో అది తిరస్కరణకు గురైంది. వైసిపి కౌన్సిలర్లను ప్రలోభపెట్టి టిడిపిలోకి తీసుకోవడం వెనుక ఎమ్మెల్యే బోనెల పాత్ర స్పష్టంగా ఉంది. ఒకసారి విఫలమైనా మళ్లీ అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వాలని టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. గత మూడు నెలలుగా మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించకుండా ఎమ్మెల్యే కమిషనర్‌పై ఒత్తిడి పెంచుతున్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌తో సహా వైసిపి కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నా కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. చైర్‌పర్సన్ ఆదేశాలను కమిషనర్ పూర్తిగా ధిక్కరించే పరిస్థితిలో ఉన్నారు. పాలకవర్గాన్ని పక్కనపెట్టి పూర్తిగా ఎమ్మెల్యే కనుసన్నల్లో మున్సిపల్ అధికారులు పని చేస్తున్నారు. అలాగే ఇటీవల తోటపల్లి నిర్వాసితుల సంఘం నాయకులు బంటు దాసు ఇంటిపై అధికారుల దాడి వెనుక ఎమ్మెల్యే ప్రమేయం, తహశీల్దార్‌ను దుర్భాషలాడిన విషయంపై స్పందించిన దాఖలాల్లేవు. తహశీల్దార్ వ్యవహారంపై విజయనగరంలో జెడ్పీ చైర్మన్ ప్రెస్‌మీట్‌లో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు తప్ప పల్లెత్తు మాట కూడా అనలేదు. ఇన్ని పరిణామాలు చోటు చేసుకున్నా ప్రతిపక్ష పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా జోగారావు మౌనం వహిస్తుండడం వెనుక లోపాయికారీ అవగాహన ఒప్పందంలో భాగమేనన్న ప్రచారం సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూకబ్జాలు, అక్రమాలపై తాజా ఎమ్మెల్యే బోనెల నోరు మెదపకుండా ఆయనతో మాజీ ఎమ్మెల్యే జోగారావు బిగ్ డీల్ కుదుర్చుకున్నారనే చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే జోగారావు మధ్య అవగాహన ఒప్పందం కుదర్చడం వెనుక వారి సామాజిక వర్గానికి చెందిన పెద్దలు ఉన్నారని నియోజకవర్గ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. పెద్దలు కుదిర్చిన ఆ ఒప్పందం అమలులో భాగంగానే తాజా, మాజీ ఎమ్మెల్యేలిద్దరూ ఒకరిపై ఒకరు రాజకీయ ఆరోపణలు, విమర్శలు చేసుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా సమకాలీన రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలపై జోగారావు స్పందించాల్సిన అవసరం ఉంది. కానీ ఆయన గత కొంతకాలంగా మౌనం వహించడం ఆ ఒప్పందంలో భాగమేనన్న

తొలేళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు

- పట్టణమంతా విద్యుత్ దీపాలాంకరణ
- నేటి నుంచి భారీ వాహనాల రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలో శ్యామలాంబ పండుగలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు సాంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవ నిర్వహణకు చర్యలు చేపట్టారు. ఈ ఉత్సవంలో గొల్లి వీధి, అక్కేన వీధి, నాయుడు వీధి, డబ్బీవీధి, మెంటాడ వీధులకు చెందిన పెద్దలు, ప్రజలు పాల్గొంటారు. జన్నివీధిలో గల అమ్మవారి గద్దె నుంచి ఘట్టాలను గొల్లివీధి వాసులు తీసుకొస్తూ కర్రలతో సాము తిప్పుతారు. ఒక వీధి తర్వాత మిగిలిన వీధి వాసులంతా ఈ ఉత్సవంలో పాల్గొని ఘట్టాలను ఊరేగింపు చేస్తారు. ఈ ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు.

విద్యుత్ దీపాలతో అలంకరణ

పండగ నేపథ్యంలో పట్టణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. బైపాస్ రోడ్డు జంక్షన్, లెప్రసీ ఆసుపత్రి జంక్షన్ వద్ద రంగురంగుల ముఖద్వారం ఏర్పాటు చేశారు. అయితే పట్టణంలో చాలా చోట్ల ప్రత్యేక విద్యుత్ దీపాలు వెలగని పరిస్థితి కనిపిస్తోంది. విద్యుత్ లోఓల్టేజ్ సమస్య కారణంగా ప్రత్యేక విద్యుత్ దీపాలు వెలిగించడం లేదని తెలుస్తోంది.

పటిష్ట భద్రతా ఏర్పాట్లు

పండగ నేపథ్యంలో ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి, డిఎస్‌పి రాంబాబు పర్యవేక్షణలో టౌన్ సిఐ అప్పలనాయుడు భద్రతా ఏర్పాట్లు చేశారు. మొత్తం 918 మంది ప్రత్యేక పోలీసులను మొహరించారు. గతంలో జరిగిన పండుగ సందర్భంగా ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఉయ్యాల కంబాల ఉత్సవం


శ్యామలాంబ పండుగలో భాగంగా ఆదివారం సాయంత్రం పెదకోమటి పేట గద్దె వద్ద ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో గద్దె వద్ద ఏర్పాటు చేసిన ఉయ్యాలో జమిందార్ కుటుంబానికి చెందిన యువరాజు విక్రం చంద్ర సన్యాసిరాజును కూర్చోబెట్టి పెద్దలు ఊపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ సమక్షంలో ఉత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు హాజరు కావడంతో స్వల్ప తోపులాట జరిగింది.



అమ్మవారి గద్దె వద్ద ఉయ్యాల కంబాలు నిర్వహిస్తున్న కమిటీసభ్యులు



అమ్మవారి ఘటాలతో వస్తున్న మంత్రి సంధ్యారాణి



పట్టణంలో వెదజల్లుతున్న విద్యుత్ కాంతులు

శ్యామలాంబ పండుగకు 1240 ప్రత్యేక బస్సులు

పార్వతీపురం టౌన్ : జిల్లాలో సాలూరు శ్యామలాంబ అమ్మవారి పండగ యాత్రను పురస్కరించుకొని ఈ నెల 18 నుంచి 21 వరకు విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని ఆర్టీసీ డిపోల నుండి సాలూరుకు 1240 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రధాన రవాణా శాఖ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.. విశాఖపట్నం నుండి విజయనగరం, విజయనగరం సాలూరు, పార్వతీపురం సాలూరు, బొబ్బిలి సాలూరు, శ్రీకాకుళం -రాజాం, రాజాం -సాలూరు, శ్రీకాకుళం - సాలూరు, సాలూరు-పాచిపెంట, సాలూరు-దుగ్గేరు, సాలూరు- శంబర, బలిజిపేట, వాడాడ, నారాయణపురం, సాలూరు -తోణాం నుంచి బస్సు సర్వీసులను నడపనున్నట్టు తెలిపారు. 18న 120 బస్సులను, 19న 120, 20న 500, 21న 500 బస్సులను నడపనున్నట్టు తెలిపారు.

సిరిమాను తిరిగే ప్రాంతాల్లో విద్యుత్తు నిలిపివేత

సాలూరు రూరల్ : శ్యామలాంబ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా మంగళవారం సిరిమాను తిరిగే ప్రాంతాలైన నాయుడు వీధి, అల్లు వీధి, వెలంపేట, మెయిన్ రోడ్ ,డబ్బీవీధి, లవుడు వీధి, అక్యాన వీధి, జన్నివీది, డీలక్స్ సెంటర్, కోటవీధి, మెంటాడ వీధి తదితర ప్రాంతాల్లో సాయంత్రం మూడు గంటల నుండి సిరిమాను తిరిగే సమయం వరకు విద్యుత్ సరఫరాను అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డిఇ రంగారావు తెలిపారు. ఈ అంతరాయానికి పట్టణ ప్రజలంతా సహకరించాలని కోరారు.

విషజ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - సాలూరురూరల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు ఎన్‌వై నాయుడు, శ్రీనివాసరావు

మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారినపడి తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, తక్షణమే అధికారులు స్పందించి నివారణ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎన్‌వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. మండలంలోని డెన్సరాయికి చెందిన మర్రి చిన్న, మర్రి కార్డియా, మర్రి టిక్కో, మర్రి పూసే, మర్రి కుంబే, మరి గీత, కొర్రబూతే, మర్రి తమ్ము నాలుగు రోజుల నుంచి జ్వరాలతో బాధపడుతున్నారన్నారు. వీరిలో ఆశా కార్యకర్త కూడా ఉందన్నారు. వీరంతా తోణాం పిహెచ్‌సికి, సాలూరు వంద పడకల హాస్పిటల్‌కు రావాలంటే తీవ్ర జ్వరాలతో బాధపడుతున్నారని, అంబులెన్స్ ఉంటే గాని సాధ్యం కాదని అన్నారు. కావున అధికారులు తక్షణమే స్పందించి వైద్యసేవలందించాలని కోరారు. అలాగే బాధితులకు పరీక్షలు జరిపి మందులు అందుబాటులోకి ఉంచాలని కోరారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల పరిధిలోని అన్ని పిహెచ్‌సిల్లో అన్ని రకాల జ్వరాలకు పూర్తిస్థాయిలో మందులు పిహెచ్‌సిలో సబ్ సెంటర్లో ఉంచాలని డిమాండ్ చేశారు. వర్షాలు ముందుగానే వచ్చినందున మారిన వాతావరణానికి తగ్గట్టుగా ప్రజలకు అందుబాటులో మందులు ఉంచాలని, పిహెచ్‌సిలో ఒక్క డాక్టరే ఉన్న వద్ద రెండో వైద్యాధికారిని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో రక్త పరీక్షలు


ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మలేరియాను నియంత్రించాలని జిల్లా యంత్రాంగం ఆలోచిస్తోంది. మే 1నుంచి జిల్లాలో ఇండోర్ స్ప్రేయింగ్ (ఐఆర్‌ఎస్) ప్రారంభించారు. ఇది జూన్ 15 వరకు కొనసాగుతుంది. జూన్, జూలై, ఆగస్టు నెలలు జిల్లాలో మలేరియా వ్యాప్తికి కీలకమైన నెలలుగా భావిస్తూ జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. 248 గ్రామాలను మలేరియా తీవ్రత గల గ్రామాలుగా మలేరియా అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల్లో దాదాపు 50 వేల జనాభా ఉంటుందని అంచనా. మలేరియాను నియంత్రించడానికి ఐఆర్‌ఎస్‌తో పాటు, ఏ వ్యక్తిలోనైనా పరాన్నజీవి ఉంటే వాటిని కూడా నిర్మూలించడం ద్వారా వ్యాప్తి తగ్గించేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని యోచిస్తున్నారు. ఏ వ్యక్తిలోనైనా పరాన్నజీవి ఉంటే గుర్తించడానికి రక్త పరీక్షలు నిర్వహించాలని ప్రణాళిక తయారు చేశారు. తద్వారా మలేరియా వ్యాప్తిని పూర్తిగా నివారించవచ్చని భావిస్తున్నారు. మలేరియాను నియంత్రించడానికి ఖచ్చితమైన ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మలేరియా కారణంగా ఎటువంటి మరణం సంభవించకూడదని ఆయన స్పష్టం చెప్పారు. వర్షాకాలం ముందు తాగునీటి వనరులను క్లోరినేట్ చేయడం, ఆయిల్ బాల్స్ తయారీ మొదలైన వాటిని సిద్ధం చేసి పరిస్థితిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. గిరి చైతన్యం అనే డిజిటల్ క్షేత్ర స్థాయి ప్రచార వాహనం తయారు చేయిస్తున్నామని, త్వరలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. మలేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా బహుళ కార్యకలాపాలకు దీన్ని ఉపయోగిస్తున్నామని ఆయన అన్నారు. దోమల లార్వాలను నియంత్రించడానికి గంబూసియా చేపలు నీటి వనరుల్లోకి విడుదల చేస్తున్నామని, దోమల నియంత్రణ కార్యకలాపాలను పిచికారీ చేయడానికి లేదా విడుదల చేయడానికి డ్రోన్ సేవలను ఉపయోగిస్తామని ఆయన అన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ఏడు కేంద్రాల్లో 721 మంది విద్యార్థులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్



పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరగనుంది. జిల్లా విద్యా శాఖ అధికారులు పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎంవి రమాజ్యోతి తెలిపారు. పార్వతీపురంలో 3, పాలకొండ 3, సాలూరు ఒకటి మొత్తం జిల్లాలో 7 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షల్లో 721మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఈనెల 19 నుంచి 26 వరకు పరీక్షలు జరగనున్నాయి. వీటితో పాటు ఓపెన్ స్కూల్ పదో తరగతి పరీక్షలు ఐదు కేంద్రాల్లో జరగనున్నాయి. ఈనెల 19 నుంచి 28 తేదీ వరకు జరగున్నాయి. సోమవారం నుంచి జరగనున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసుకునేందుకు సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఏడు కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. సకాలంలో విద్యార్థులు పరీక్షకు హాజరు కావాలని కోరారు.

పరీక్ష షెడ్యూల్..

19 తేదీన మొదటి లాంగ్వేజ్
20న రెండో లాంగ్వేజ్
21న ఇంగ్లీష్
22న గణితం
23న ఫిజికల్ సైన్స్
24న బయోలాజికల్ సైన్స్
26న సోషల్ స్టడీస్

తోటపల్లి కాలువ సమస్య పరిష్కరించాలని

28న సబ్ కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి కాలువ సమస్యను పరిష్కరించాలని మండలంతో పాటు పలు గ్రామాలకు సాగునీరు అందించాలి కోరుతూ ఈనెల 28న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం పాలకొండ వడమ రోడ్‌లో గల శ్రీ వాసవి తిరుమల కళ్యాణమండపంలో తోటపల్లి ఎడమ కాలువ ఆయకట్టు రైతుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు ద్వారా లక్షా 80వేల ఎకరాలు ఆయకట్టుకు సాగునీరందించాల్సి ఉండగా 80వేల ఎకరాలకు సాగునీరందదడం లేదు. పాలకొండ మండలంలో 7 ,8 వ బ్రాంచ్ పరిధిలోగ్రామాలకు ఆయకట్ట రైతులకు కొన్నేళ్ల నుంచి సాగునీరందడం లేదన్నారు. అనేక సందర్భాల్లో రైతులు విన్నవించుకున్నప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదన్నారు. డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించి ఇప్పటికే పని పూర్తి చేస్తే జూన్ నాటికి సాగునీరందించవచ్చునని అయినా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. తోటపల్లి ప్రాజెక్టు పూర్తి అవ్వాలంటే రూ.590 కోట్లు అవసరమని ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసినప్పటికీ, ప్రభుత్వం రూ.47 కోట్లు మాత్రమే బడ్జెట్లో కేటాయించిందన్నారు. ఈ నిధులు ఉద్యోగుల జీతాలు, నిర్వహణకు మాత్రమే సరిపోతాయన్నారు. దీంతో తోటపల్లి కాలువ పనులు ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఇప్పటికే ఈనెల 6న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద తోటపల్లి ఎడమ కాలువ ఆయికట్టు రైతులు నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేసిందన్నారు. అయినా అధికార యంత్రాగంలో చలనం రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మే 28లోపు ప్రాజెక్టు పనులు పూర్తి చేసేందుకు నిర్దిష్ట ప్రతిపాదనలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, అభ్యుదయ రైతు ఖండాపు ప్రసాదరావు మాట్లాడుతూ తోటపల్లి కాలువ సమస్య పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న తలపెట్టిన సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆరోజున ఉదయం 10 గంటలకు పాలకొండ దుర్గగుడి సెంటర్‌కు రైతులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమం పాలకొండ, రుద్రపేట, సింగన్నవలస, ఎన్‌కె రాజపురం, లుంబురు, గరుగుబిల్లి, చింతాడ, వాటపాగు, పొట్లి, ఎల్ ఎల్ పురం, బాసూరు, పద్మాపురం తదితర గ్రామాల నుంచి రైతు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి

గ్రంథాలయానికి దారేది?



అధ్వానంగా ఉన్న గ్రంథాలయానికి వెళ్లే దారి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయానికి వెళ్లడానికి పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగర పంచాయతీ ఎదురుగా ఉన్న గ్రంథాలయానికి వెళ్లేదారి పూర్తిగా అధ్వానంగా ఉంది. బురదతో పాటు అక్కడే నగర పంచాయతీ ట్రాక్టర్లు ఉండడంతో గ్రంథాయాలనికి వెళ్లడానికి పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి పరిస్థితి వస్తుంది. ఈ విషయమై పాఠకులు పలుమార్లు నగర పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి

సముచిత స్థానం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్



నియోజకవర్గ మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేసిన వారికి తప్పకుండా సముచిత స్థానం లభిస్తుందని, గత పాలకుల వైఫల్యాలతో పాటుగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి కార్యకర్తలు బలంగా తీసుకువెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన మినీ మహానాడుకు పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని తన తెలుగు తమ్ముళ్ల కోసం ఎంతటి విపత్తు ఎదురైనా కలబడి నిలబడి పోరాడుతానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని ఒక స్థాయికి తీసుకొచ్చిన నందమూరి తారక రామారావు ఆశయాలను మన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలబెట్టారని, ముఖ్యమంత్రి అడుగుజాడల్లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నడుచుకుంటూ పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యత కల్పిస్తూ వివిధ రంగాల్లో వివిధ కేటగిరీల్లో పదవులు, నామినేటెడ్ స్థానాలు కల్పించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అయితే ప్రతి కార్యకర్త, నాయకులు పార్టీ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని అప్పుడే మనం మరెన్నో విజయాలు సాధించగలమని అన్నారు. ఇదిలా ఉండగా పార్వతీపురం పట్టణానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తారని అన్నారు. ఇందులో ముఖ్యంగా పార్వతీపురం పట్టణ శివారులో గల డంపింగ్ యార్డ్ తరలింపునకు తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఇది ఎంతో సంతోషకరం విషయమని అన్నారు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు పలు జిల్లా కార్యాలయాల సముదాయాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ప్రణాళిక సిద్ధం చేశారని, త్వరలోనే ఆయన పర్యటన చేసి వీటిని నిర్మాణాలకు దిశా నిర్దేశం చేస్తారని అన్నారు. అలాగే అడారుగడ్డ రిజర్వాయర్ పూర్తికి కూడా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. దీంతో పాటు వరహాలగెడ్డ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.40 లక్షలు ఇస్తే సరిపోతుందన్న ఉద్దేశంతో తగిన ప్రణాళికలు కూడా తయారు చేసి ఇరిగేషన్ శాఖకు పంపించామని తెలిపారు. ఇవన్నీ త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ మూత పడడానికి ప్రధాన కారణం వైసిపి ప్రభుత్వమేనని ఆరోపించారు. రైతుల నోట్లో మట్టి కొట్టి ఫ్యాక్టరీ మూత పడ్డానికి ప్రధాన కారణం జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అని అందరికీ తెలుసునన్నారు. రైతులను మోసం చేసే ఏ ఒక్కర్నీ ఉపేక్షించేది లేదని, త్వరలోనే వారికి మరింత బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాలు కల్పించడం జరుగుతుందని, కార్యకర్తలందరికీ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ దిగులు చెందొద్దని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి మనమంతా సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్వతీపురం వివిధ నాటక రంగాల కళాకారులకు సన్మానించి తగిన నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు బొడ్డు పైడి రాజు, మండల, పట్టణ టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com


మినీమహానాడు నిర్వహణా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

20న గుమ్మలక్ష్మీపురంలో మినీ మహానాడు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 20న గుమ్మలక్ష్మీపురంలో మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు. సందర్భంగా ఆదివారం మినీ మహానాడు నిర్వహించే స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

మినీ మహానాడుకు అధిక సంఖ్యలో తరలి రావాలి

గరుగుబిల్లి: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఈనెల 20న గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించనున్న నియోజకవర్గ మినీ మహానాడుకు మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల టిడిపి అధ్యక్షులు, కొప్పల వెలమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ఆక్కేన మధుసూదనరావు వెల్లడించారు. మండలంలోని నాగూరులో ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మినీ మహానాడులో నాయకులు, కార్యకర్తలు పార్టీ ఇచ్చిన సభ్యత్వ గుర్తింపు కార్డుతో హాజరు కావాలని మధుసూదనరావు పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ ఎంఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. మండలంలోని గుచ్చిమి సచివాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 నుంచి 23 వరకు రాష్ట్రస్థాయి ఐఎఎస్ అధికారుల పర్యటనలో భాగంగా గ్రామ అభివృద్ధి ప్రగతి పథం, వివిధ శాఖలపై సమీక్షించారు. వీటిపై అన్ని శాఖల అధికారులు వాటి శాఖాపరమైన నివేదికలను సిద్ధం చేసుకొని అధికారులు అడిగిన వాటికి సమాధానాలు ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి కె కె కుమార్ వర్మ, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి మధుసూదనరావు

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆది వారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆదే విధంగా విద్యార్థులకు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, తెలుగు గ్రామర్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జూన్ 6వరకు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు ఎస్.మధుసూదనరావు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాఖాగ్రంథాలయ నిర్వాహకులు మధుసూదన రావు కోరారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై కుల దురహంకారంతో అవమానించి, నిర్భంధించి దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురంలో ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో నిరంతరం దళితులపై ఏదో ఒక చోట నిత్యం దాడులు ఏదో ఒక రూపం జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పక్కాగా అమలు చేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం ఉన్నారని రంజిత్ కుమార్ అన్నారు. దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడికి పాల్పడ్డ వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామాలకు బిటి రహదారి సౌకర్యం కల్పించాలని హుస్సేన్‌పురం, గదబవలస గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. కత్తులకవిటి గ్రామ బిటి రహదారి నుంచి గదబవలస గిరిజన గ్రామం మీదుగా హుస్సేన్ పురం వరకు బిటి రహదారి నిర్మాణం చేపడితే ప్రయాణం ఎంతో అనువుగా ఉంటుందని గ్రామస్తులు అంటున్నారు. 2013లో అప్పటి కేంద్ర గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రసూర్యనారాయణ దేవ్ నీలంపేట, ఎలిసిపురం, గదబవలస, సంధిమానుగూడ, రాయిమానుగూడ గ్రామాలను అనుసంధానం చేసేందుకు వీలుగా అప్పట్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.కోటీ 25 లక్షలతో రహదారులు నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన కూడా చేశారని, ఏళ్లు గడుస్తున్నా కనీసం రహదారుల అభివృద్ధి పడకపోవడంతో చిన్నపాటి చినుకు పడిన రహదారులు అధ్వానంగా తయారవ్వడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా గ్రామాలకు 108, 104, వాహనాలు వచ్చే దాఖలాలు కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న గదబవలస-హుస్సేన్‌పురం రహదారి

సులభంగా అమ్మవారి దర్శనానికి చర్యలు : ఎస్‌పి

900 మంది పోలీసు బందోబస్తుతో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణంలో 18,19,20 తేదీల్లో జరిగే శ్యామలాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని భక్తులకు సురక్షితమైన, సులభమైన అవాంఛనీయ జరగకుండాను అమ్మవారిని దర్శించుకొనేలా పటిష్టమైన ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లుగా జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన శ్యామలాంబ అమ్మవారి ఆలయాన్ని, సిరిమాను ఏర్పాట్లును, సిరిమాను, ఘటాలు తిరిగే మార్గాన్ని, సాంస్కృతిక కార్యక్రమాలు, వాహనాలు నిలుదల చేసే ప్రదేశాలను, పోలీస్ అధికారులకు, సిబ్బందికి కేటాయించిన బందోబస్తు ప్రతి పాయింట్‌ను ఆయన సందర్శించి, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుతంగా నిర్వహించేందుకు సుమారు 900 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తును 08 సెక్టార్లుగా విభజించి, రెండు షిఫ్టుల్లో బందోబస్తు ఏర్పాటు చేసి, భక్తులు అమ్మవారిని సురక్షితమైన, సులభమైన దర్శనం చేసుకొనేలా చర్యలు చేపట్టామన్నారు. పండగ రోజుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా, వాహనాల రెగ్యులేషను, ట్రాఫిక్, భక్తుల రద్దీని డ్రోన్స్ తో పర్యవేక్షిస్తామన్నారు. పండగ బందోబస్తును పాలకొండ డిఎస్పీ పర్యవేక్షిస్తారన్నారు. వాహనదారులకు, ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ రద్దీ ని బట్టి డైవర్షన్ చేసే విధంగా ప్లాన్ అఫ్ యాక్షన్ రూపొందించు కొవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అమ్మవారి ప్రధాన ఆలయం సందర్శించి, భక్తుల క్యూ లైన్స్, బందోబస్తు ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించారు. భక్తుల క్యూ లైన్స్ కోసం ఏర్పాటు చేస్తున్న బ్యారికేడ్లు పటిష్టంగా ఉండేలా చర్యలు చేపట్టారు. సిరిమాను తయారీ ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించి, సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ శాఖాధికారుల సహాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా సిరిమాను తిరిగే ప్రాంతాల్లో పురాతన భవంతులు, శిధిలావస్థలో ఉన్న భవంతులు గుర్తించి భద్రత ప్రమాణల దృష్ట్యా జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, భక్తులకు చేరువలో వైద్య సదుపాయం ఏర్పాట్లు ను ఆ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే ప్రదేశాల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను తనిఖీ చేసి స్టేజి ఏర్పాట్లను, ప్రజల రక్షణ కొరకు , అల్లర్లు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. వాహనాలు నిపుదల చేసే ప్రదేశాలు, సిసి కెమెరాలు అనుసంధానం చేసి పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ సందర్శించారు. ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా, నిజాయితీగా నిర్వర్తించాలని, ప్రజలతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పాలకొండ డిఎస్పీ రాంబాబు, ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, సాలూరు పట్టణ సిఐ అప్పలనాయుడు, ఎస్పీ సిఐ రంగనాథం, సైబర్ సెల్ సిఐ శ్రీనివాసరావు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసు కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పెరుగుతున్న ఎండలు.. తడారుతున్న గొంతులు

దాహం తీరే దారి లేక ప్రజల అవస్థలు

కొన్ని ప్రదేశాల్లో గుక్కెడు నీరందక ప్రజలు దాహమో.. రామచంద్రా.. అంటు అలమటించాల్సిన పరిస్థితి. మండుతున్న ఎండలతో గొంతు తడుపుకోవడానికి ప్రజలు పరుగులు పెట్టాల్సిన దుస్థితి. ప్రజల సౌకర్యాలను పట్టించుకోవాల్సిన అధికారులు సైతం నిమ్మకునీరెత్తున్నట్టు వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితులు దాపురిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

ప్రజాశక్తి - కురుపాం

ఏజెన్సీలో వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఎండలకు అల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానుడు భగభగమంటూ పొగలు కక్కుతున్నాడు. వేడి తీవ్రతతో తాగునీటి అవసరాలు పెరిగాయి. గ్రామాల నుంచి ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. మండల కేంద్రంలో గుక్కెడు నీరు దొరక్క అవస్థలుపడుతున్నారు. కురుపాం మండల పరిధిలో తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు, పలు కార్యాలయాలకు సమస్యలపై ప్రజలు వినతులు అందించడానికి వస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఎండ తీవ్రతతో దాహం తీరే పరిస్థితి లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మే మూడో వారం వచ్చినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఆరుబయట చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దుకాణాల్లో తాగునీటి సీసాలు కొనుగోలు చేసి గొంతు తడుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

దాహం తీరే దారేది...?

నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు అధికారులు కనీస తాగునీటి వసతులు కూడా ఏర్పాటు చేయడం లేదు. మండుతున్న ఎండల్లో గొంతు ఎండబెట్టుకొని కార్యాలయాలకు వస్తే గుక్కెడు నీరు దొరకడం లేదు. అదేవిధంగా సచివాలయాలు, ఆర్‌బికె కేంద్రాల వద్ద కూడా ఇదే పరిస్థితి, గొంతు తడుపుకోవాలంటే దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి.



ఎంపిడిఒ కార్యాలయంలో కానరాని చలివేంద్రం

చలివేంద్రాల జాడేది..?

గతంలో ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల ముందు సిబ్బంది చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు చలివేంద్రాల ద్వారా దాహార్తిని తీర్చుకొనేవారు. అదేవిధంగా నిత్యం ప్రజలతో రద్దీగా ఉన్న బస్టాండ్ వద్ద, రావాడ జంక్షన్ వద్ద చలివేంద్రాలు గతంలో ఏర్పాటు చేసేవారు. బస్సుల కోసం మండుటెండలో నిలబడే ప్రయాణికులు ఈ చలివేంద్రాలను వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఈ చలివేంద్రాల జాడే కనిపించడం లేదు. ఫలితంగా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పదవులకు రాజీనామా చేసి పార్టీ మారాలి

అధికారుల తీరు సరిగ్గా లేదు

వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు

ప్రజాశక్తి - పాలకొండ

ఇటీవల వైసిపి నుంచి ఎంపిటిసి సభ్యులతో పాటు కౌన్సిలర్లు పార్టీ మారడం సరికాదని, ఎంపిటిసి, కౌన్సిల్ పదవులకు రాజీనామా చేసి బయటకు వెళ్లాలని మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు కనపాక సూర్య ప్రకాష్, వెలమల మన్మథరావు అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు పదవులకు గానీ, పార్టీ సభ్యత్వం గానీ రాజీనామా చేయకుండా బయటికి వెళ్లడం సరికాదన్నారు. నగర పంచాయతీలో అడ్డగోలుగా నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. ఇన్చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేను పక్కను పెట్టి అధికారులు ఇలా నియమకాలు చేపట్టడం అన్యాయం అన్నారు. నోటిఫికేషన్ వేయకుండా మినిట్స్ బుక్‌లో నమోదు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా నియామకం చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను మండల పరిషత్తు, నగర పంచాయతీ సమావేశాలకు ఆహ్వానించకపోవడం కారణమేమిటిని ప్రశ్నించారు. మూడేళ్లగా సమావేశాలకు ఆహ్వానించిన అధికారులు ఇప్పుడు పిలవకపోవడమేమిటని ప్రశ్నించారు. ప్రోటోకాల్ పాటించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఏకైక నగర పంచాయతీ పాలకొండలో ఉందని, కానీ నగర పంచాయతీ అధికారులు నిబంధనలకు పొడుస్తున్నారన్నారు. నగర పంచాయతీ సమావేశాలకు ఎమ్మెల్సీ ఆహ్వానం పంపించకపోతే న్యాయ పోరాటానికి సిద్ధమవుతామన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పల్లా ప్రతాప్, రౌతు హనుమంతరావు, కౌన్సిలర్లు దుప్పాడు పాపి నాయుడు, బాసర కాంతారావు, కడగల రమణ, కోడం విజయకుమార్, పల్లా భాను, పనుకువలస ఎంపిటిసి కోట అజయ్‌కుమార్, అంపిలి, లుంబురు సర్పంచులు లోలుగు విసు, ఉపేంద్ర, లక్ష్మణమూర్తి, దుంపలు చిన్ని తదితరులున్నారు.

అమర జవాన్ల త్యాగం మరువలేనిది

ప్రజాశక్తి- మెంటాడ

దేశరక్షణలో అసువులు బాసిన వీరజవాన్ల త్యాగం మరువలేనిదని పలువురు కొనియాడారు. ఇటీవల భారత్-పాక్ దాడుల్లో అమరుడైన వీరజవాన్ మురళీ నాయక్ సహా కొన్నేళ్ల క్రితం జరిగిన దాడుల్లో వీర మరణం పొందిన మెంటాడ గ్రామానికి చెందిన జవాన్ మీసాల రామకృష్ణ, చైనాతో జరిగిన దాడుల్లో ప్రాణాలర్పించిన సంతోష్ బాబుకు నివాళిగా క్విక్ డోనర్ సర్వీస్ ప్రతినిధులు ఆదివారం మెంటాడలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువకులు పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, రక్తదాతలు అమరుల త్యాగాన్ని కొనియాడారు. రక్తదానం ఆవశ్యకతను వివరించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో కొల్లా భరత్ కుమార్, వాసు, శివాజీ, ప్రసాద్, చిరంజీవి, రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కానరాని సిసి రోడ్లు

ప్రజాశక్తి - సీతంపేట

ఒక గ్రామం అభివృద్ధి చెందాలంటే కాలువలు, సిసి రోడ్లు తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే ఆ గ్రామం సుందరంగా, అందంగా కనిపిస్తుంది. అయితే చాలా గిరిజన తండాల్లో కాలువలు, సిసి రోడ్లు లేకపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. గిరిజన అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. సీతంపేట ఏజెన్సీలో సుమారు 500 గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటిలో సిసి రోడ్లు చాలా గ్రామాలకు లేవు. దీంతో వాడుక నీరు, మురుగు నీరు ఇళ్ల ముందే నిల్వ ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. దీంతో గిరిజనులు అనారోగ్యం పాలవుతున్నారు. వర్షాకాలంలో కాలువల్లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లకుండా స్తంభించడంతో దుర్వాసన, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీనివల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ధారపాడు పంచాయతీలో గల గోలుకుప్పగూడ, ఓమానుగూడ, చింతమానుగూడ, రామానగరం పెద్దగూడ, రామానగరం కాలనీ, బూతాయిగూడ, బూర్జిగూడ, పివి ఈతమానగూడ పంచాయతీలో నెల్లిగండి, నడిమి దుంబంగివలస, దిగువ దుంబంగివలస, ఎగువ గురండి పుట్టిగాం, నడిమి పుట్టిగాం, కొత్తగూడ ధోనుభాయి పంచాయతీలో మేకవ, ధోనిబాయిలో గొల్లపేట వీధి, పెద్దవీధులకు సిసి రోడ్లు లేవు. అదేవిధంగా ఇతర పంచాయతీల్లో కె.వీరగొట్టం, పుప్పాడ, అంబలి గండి, మేనకోట కురసింగి, సంధిగూడ, జయపురం మెయిన్ వీధి, గడ్డికారం, టిటుకపాయిగూడ, కుసుమూరు తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువ లేక డ్రైనేజీ సమస్య వెంటాడుతుంది. అధికారులకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా సమస్య పరిష్కరించడంలేదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలకు సిసి రోడ్లు, కాలువలు నిర్మించి ఆరోగ్యాలను కాపాడాలని కోరుతున్నారు

పంచాయతీల ద్వారా రోడ్లు వేస్తాం

గ్రామాల్లో సిసి రోడ్లు, పంచాయితీ నిధులతో సిసి రోడ్లు, కాలువలు నిర్మాణాలు చేపడతాం. సిసి రోడ్లు కావాలని వినతులు వస్తున్నాయి.

పి. కిరణ్,
పంచాయతీరాజ్ ఎఇ, సీతంపేట మండలం

కాలువల్లేక ఇళ్ల ముందే మురుగునీరు


సిసి కాలువ, రోడ్డు లేని గిరిజన గూడెం

గ్రామాల్లో సిసి రోడ్లు వేయాలి

గిరిజన గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువలు లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం రాకముందే సిసి రోడ్లు నిర్మించి కాలువలు పూర్తి చేయాలి. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

ఆరిక భాస్కరరావు,
సిపిఎం మండల కార్యదర్శి, సీతంపేట మండలం.

వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నాం

వర్షాకాలంలో నీరు ఇంటి ముందు నిల్వ ఉండిపోతుంది. దీంతో కాలువలు, సిసి రహదారులు లేకపోవడంతో మట్టితో మేటలు వేసి వాకిట్లో బురదగా తయారవుతుంది. వర్షం తగ్గేంత వరకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మా పంచాయతీలో కొన్ని గ్రామాలకు సిసి రోడ్లు కాలువలు లేవు. కావున అధికారులు తక్షణమే సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలి.

పత్తిక వీరన్న,
సర్పంచ్ పివి ఈతమానుగూడ.


హెచ్ కారాడవలస వద్ద జంఝావతి కాలువ గట్టును తవ్వేసిన అక్రమార్కులు

అక్రమ తవ్వకాల బారిన జంఝావతి కాలువ గట్లు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గంలో అక్రమకంకర తవ్వకందారుల ఆగడాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఒకవైపు మైనింగ్ అధికారులు ప్రైవేటు నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి నియంత్రణలు చేస్తున్నప్పటికీ తవ్వకాలకు హద్దే లేకుండా పోయింది. రియల్ ఎస్టేట్ల అర్థదారులకు, గృహ నిర్మాణాలు, కబ్జా స్థలాలు ఫిల్లింగ్ చేయడానికి అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలాలలోనూ, రైతుల పొలాల్లోనూ, చెరువుల్లోనూ రాత్రికి రాత్రి పెద్దపెద్ద యంత్రాలతో తవ్వకాలు సాగించి తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇవి చాలక వారి రైతులకు సాగునీరందించే కాలువ గట్లపై కూడా వారి కన్ను పడింది. పార్వతీపురం మండలం పెదబొండపల్లి నుంచి నర్సిపురం పంచాయతీ హెచ్.కారాడవలస మీదుగా సీతానగరం మండలానికి వెళ్లే హైలెవెల్ కాలువకు చెందిన లింక్ ఛానల్ గట్లను యథేచ్ఛగా తవ్వి రాత్రికి రాత్రి కంకరను తరలిస్తున్నారు. జంఝావతి కాలువలో నీరు పారకపోయినా, వచ్చే వర్షాకాలంలో వరద నీరు కాలువల్లో చేరి నిల్వ ఉంటుంది. అయితే భారీ వర్షాలకు కాలువ గట్లు బలహీనపడి గండ్లు దిగువ సాగు చేసుకుంటున్నా పంట పొలాల్లో వరద నీరు నష్టం కలిగించే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రాజెక్టుకు చెందిన కాలువ గట్లు బలహీనమైతే రాబోయే రోజుల్లో జంఝావతి జలాశయం లక్ష్యానికి తీవ్ర విఘాతం ఏర్పడే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం చిన్న జలాశయాలను పట్టించుకోక పోవడంతో యంత్రాంగం నిర్వీర్యమైపోయి కాలువ గట్ల నిర్వహణ, పరిరక్షణ లేకుండా పోతుంది. జంఝావతి ప్రాజెక్టు కోసం ఇఇ, డిఇ, జెఇ వంటి వ్యవస్థ ఉన్నప్పటికీ, అది నిద్రావస్థలోకి వెళ్లిపోవడంతో మరి కొద్ది రోజుల్లో అక్రమ తవ్వకందారుల బారినపడి కాలువలు కనుమరుగైపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని కాలువ గట్లపై నిఘా వ్యవస్థను పటిష్టం చేసి, వాటిని పరిరక్షించేందుకు కృషి చేయాలని ఆయకట్టుకు చెందిన రైతులు కోరుతున్నారు.

తాటిముంజులతోఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రకృతి ప్రసాదించిన వరం తాటి ముంజలు. వేసవిలో మాత్రమే దొరికే ఈ తాటి ముంజలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పలువురు వైద్యులు చెపుతున్నారు. వీటిలో విటమిన్ ఎ, బి, సి, కె, పాస్పర్స్, పొటాషియం, ఇనుము, జింక్, కాల్షియం వంటి ఎన్నో పోషక పదార్థాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా వేసవిలో వైరస్‌ల వల్ల అమ్మవారు, చికెన్ ఫాక్స్, పొంగు, దద్దు వంటి సమస్యలు ఉన్న వారు ఈ తాటి ముంజలు తింటే ఉపశయనం కలుగుతుంది. ముంజు లోపల నీరు ఉన్న లేత ముంజులు మాత్రమే తొక్కతో తినాలి. తాటి ముంజులు తినడం వల్ల 10 రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వడదెబ్బను నివారిస్తుంది. మలబద్ధకం ఉన్న వారు తొక్కతో లేత తాటి ముంజలు తింటే మలబద్ధకం ఉండదు. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. షుగర్, డయాబెటిక్, మధుమేహం ఉన్నవారు వీటిని తింటే అవి నియంత్రణలోకి వస్తాయి. వీటిలో పొటాషియం ఉంటుంది కనుక బిపి, రక్తపోటు ఉన్నవారు తింటే చాలా మంచిది. వీటిలో కాల్షియం ఉంటుంది కనుక కాళ్ల నొప్పులు, నడుము నొప్పులు ఉన్నవారు తింటే ఎముకల పట్టుత్వం పెంచుతుంది. విటమిన్ -ఎ ఉంటుంది కనుక కంటి చూపు మెరుగుపరుస్తుంది. ఇన్ఫెక్షన్ రాకుండా ఉంటుంది. కేన్సర్ కారకాలను నియంత్రిస్తుంది. కొలస్ట్రాల్ పరిమాణాన్ని తగ్గించి గుండెపోటు, పక్షవాతం రాకుండా కాపాడుతుంది.. వేసవిలో మాత్రమే దొరికే ఈ తాటి ముంజలు తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.


విక్రయిస్తున్న తాటి ముంజులు

పంచాయతీలకు దోమల పోటు

ప్రజాశక్తి - సాలూరురూరల్

గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీల్లో దోమల బెడద విపరీతంగా ఉంది. దోమలు వర్షాకాలంలోనే వస్తాయి. అయితే ప్రస్తుతం మండువేసవిలోనూ వీటి ఉధృతి ఎక్కువ కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం 6 గంటల దాటితే ప్రతి ఒక్కరూ ఇంటి తలుపులు వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. మండలంలోని 29 పంచాయతీల్లో సుమారు 112 గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో దోమలు బెడదతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఫాగింగ్ చేసి, బ్లీచింగ్ వేయాల్సి ఉన్నా ఇటువంటి కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు చేసిన దాఖలాల్లేవు. అనేక గ్రామాల్లో మురుగు పోయేలా కాలువలను కూడా కనీసం తీయకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ విడుదల చేసినా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ఖర్చు పెట్టకుండా స్థానిక నాయకులు కాలయాపన చేస్తున్నారు. గ్రామాల్లో మురుగు నిర్వహణకు సరైన చర్యలు తీసుకోవడంలో అధికారులు, నాయకులు విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ దోమలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించి పిచికారీ చేసి బ్లీచింగ్ చల్లాలి. కానీ అటువంటి కార్యక్రమం ఏదీ కూడా చేయడం లేదు. మండలంలో పెద్ద పంచాయతీలు మినహా చిన్న పంచాయతీలకు నిధులు లేవని, నిధులున్నా అరకొరగా ఉండడంతో ప్రతి రోజూ నిర్వహణకు కష్టమవుతుందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. నిధులున్నా లేకపోయినా ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఈ దోమల బెడద నుంచి బయట పడేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు పంచాయతీ అధికారులను, సర్పంచ్‌లను వేడుకుంటున్నారు. దోమలతో రోగాలబారిన పడుతున్న ప్రజలు గ్రామాల్లో దోమలు బెడదతో చాలామంది ప్రజలు వైద్యం కోసం లక్షల రూపాయలను ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో ఉండే ఆర్ఎంపిలు దగ్గర వారం పది రోజులు వైద్యం చేయించుకోవడం ఇంకా తగ్గకపోతే పట్టణాలకు పరిగెత్తడం అక్కడ వేలకు వేలు రూపాయలను ఆసుపత్రులకు మందులకు ఖర్చు పెట్టడం చాలా బాధాకరమైన విషయమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రతి గ్రామంలో మురుగు కాలువల నిర్వహణను పరిశుభ్రంగా నిర్వహించి దోమలు నిల్వ ఉండకుండా చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.


కాలువలో పేరుకుపోయిన మురుగు